కథా నిలయం
3780
శ్రీకాకుళం

# దారికట్టు

మార్గశిరమాసపు చలిగాలి మనుషుల్ని వీధుల్లో తిరగనివ్వడం లేదు. వేగంగా ఇళ్ళకి చేరమని తరిమికొడుతున్నట్టుగా చలిగాలి వొంటిని ఝుళ్‌ఝుళ్‌మనిపిస్తోంది.

మొదటి ఆట సినిమా వదలినట్లున్నారు. మనుషులు బుద్ధిమంతుల్లా చేతులు ముందుకి కట్టుకునో, వెనక్కి పెట్టుకునో ముడుచుకుపోతూ నడుస్తున్నారు. సినీమాకబుర్లు చెప్పుకుందామనే సరదావున్నా, చలికి భయపడి నోళ్ళు తెరవడంలేదు. ధూమపానప్రియులు థియేటర్లోంచి వచ్చేక, అప్పటికి రెండో సిగరెట్టుకూడా ముట్టించీసి గుండెల్ని వెచ్చచేసుకునే ప్రయత్నంలో వున్నారు. రిక్షాలు ఒకటీ అరా మెయిన్‌రోడ్డు వదిలి, ఆ వీధి మలుపులోకి తిరిగి వేగంగా గమ్యంచేరుకోడానికి తొందరపడుతున్నాయి. శుక్లపక్షపు చంద్రుడు చలితల్లి వెన్నెల పిల్లకి పౌడరు రాస్తున్నట్టు నిర్మలంగా వున్నాడు. వీధి దీపాలు మంచులో తడిసే ఒంటరి సైనికుల్లా బిక్కుబిక్కుమంటూ వెలుగుతున్నాయి.

బజారువీధి వదిలి, సైడురోడ్డులోకొస్తే ఆ వీధి మలుపుదాటేక ఒకమోస్తరు పెద్ద కూడలివుంది. అక్కడ ఓ మూడులారీలు ఆగివున్నాయి. గుర్రుపెట్టి పెట్టి మరికాస్సేపటికి గుర్రు మానేసి పడుకున్న స్థూలకాయుల్లా వున్నాయవి. రేపటి యుద్ధానికి సర్వసన్నద్ధాలూ పూర్తిచేసుకుని, కదనరంగంలోనే కాసేపు కునుకుతీస్తున్న యోధుల్లాగానూ ఉన్నాయవి. అందులో రెండు లోడుతోవున్న లారీలు. రెండో ఆట సినిమా వదిలేక, పేసింజర్లెవరేనా తగుల్తారేమోనని చూసుకునిమరీ బయ్దేరతాయవి. వాటిక్లీనర్లూ, డ్రైవర్లూ కూడా భోజనాలుచేసి సినిమాలకి చెక్కేసారు.

మూడో లారీ మాత్రం ఖాళీదే. సాయంత్రమే ఒరిస్సానుండి సరుకువేసుకొచ్చిందది. సరుకు అన్‌లోడింగయేక డ్రైవరు సింహాద్రి దాన్నక్కడికి తీసుకొచ్చి వదిలేసి వెళ్లేడు.

క్లీనరు శివుడు మాత్రం అక్కడే వుండి చిన్న చిన్న రిపేర్లేవో స్వయంగా చూసుకుంటున్నాడు.

'గ్రీసుల బోయ్' గ్రీసు గన్‌తో లారీ పార్టులకి గ్రీజులాయలు ఎక్కిస్తున్నాడు. వాడిపేరు జాకీ లారీలకి గ్రీసు ఎక్కించి వాటిని మరుసటి ప్రయాణానికి సిద్ధంచేయడం వాడి పని.

వాడు తనపని తాను చేసుకుపోతూ వుంటే, లారీ ప్రక్కనే పీచువూడిపోతున్న పాతసీటొకదాన్ని వేసుకుని కూచున్నాడు శివుడు. వీధిదీపం వెన్నెల్తో సంధి చేసుకున్నా ఆ చుట్టు ప్రక్కలకు లారీ రిపేరు పన్లకి తగినంత కాంతి సమకూర్చలేకపోతోంది. అందువల్ల కిరసనాయిలు బుడ్డిదీపం ఒకటి అక్కడవెలుగుతోంది. అది చాలదన్నట్టుగా పాత టైరు ముక్కలుంటే వాటిని అంటించేడు శివుడు. అవి భగ్గున మండుతూ చాలినంత వెల్తుర్నిస్తున్నాయి. ఆ వెల్తుర్లో లారీలు వింతగా మెరుస్తున్నాయి. ఆ ఎర్రని ఆ వెల్తురు నల్లటి శివుడి వొంటిమీద పడి వాడు దానిమ్మగింజ రంగులో మెరుస్తున్నాడు. అంటించిన టైరు

ముక్కలమీద నుంచి నల్లని దట్టమైన పొగమీదికి వెళ్తోంది. అవి కాలుతున్నంత మేరమెత్తటి మసి కుప్ప కుప్పలుగా వెంట వెంటనే పేరుకుపోతోంది.

చిన్న కాగితం ముక్క వెతికి, దానినా మంటలో అంటించి బీడీ వెలిగించుకున్నాడు శివుడు. టీ త్రాగుతూనే జాకీతో కబుర్లు చెప్తున్నాడు.

‘‘టైరాడ్డుకీ, బేరింగులకీ గ్రీసు కొట్టేడవై పోయిందేట్రా జాకీ? జాయింట్లకి మా జాగర్తగాచూడు.. మా ముసిల్ది సంవత్తాడ్దంవూ, మా ఓనరు యీ బండీని కొన్దవూ ఒక్కసారే జరిగాంయి డీజిలు టేంకు బొక్కలు పడిపోయింది. అన్నీ వెల్డింగులే.. ఎన్నిసార్లు రిపేర్లు చేయించినా ఎక్క లీకిచ్చేస్తోంది. మొన్నలోడేసుకుని జైపూరెళ్ళాంవా! దారికడాకు దుకాణం పెట్టేడవే.. ఒక బాధ కాదు దీంతో - గేరుబాక్సు ట్రబులూ, స్టీరింగు బాక్సు ట్రబులూ, అమ్మమ్మ - సర్వీసౌగ్గీసిన సాన్దాన్లా బండీ ఓల్దయిపోయిందిరా’’

‘‘బండి పికప్పెలాగుంది?’’ లారీ కిందనుంచే అడిగేడు జాకీ.

‘‘పికప్పు పర్లేదనుకో - కాని రన్నింగులో వూరికే లబలబలాడేస్తోంది.. బాడీ కొత్తది కట్టించా ఆరేడు టన్నులదాకా అయితే పర్లేదు కానీ ఆ మీద లోడింగయితే కుయ్యో మొర్రో అంటుంది-’’

‘‘పెద్ద రిపేర్లున్నట్టున్నాయి.. పార్టులు చాలా మార్చాలి’’.

‘నిజవేఁ.. కాని కొత్త పార్టులేద్దావంటే మా ఓనరు అంతతేలిగ్గా ఒప్పుకుంటాడ్రా- అటుదిటు ఇటుదటూ పెట్టి బండిస్టార్టయిపోతే చాలాయనకి.. ఆ జాయింటు క్రాసులు చూడెలాగున్నాయో. డిఫరెన్సులు మారుద్దామంటేనే హరికథల్చెప్తాడ్రా బాబూ ఆయన’’

‘‘పావలా మదుపెట్టకూడదు లైను కెల్దం మానీకూడదు అంటే ఎలాగవుద్దిరా’’

‘‘బాగా చెప్పేవు’’ బీడీనుసి రాలుస్తూ తలూపేడు శివుడు.

* * *

శివుడు క్లీనరుగా జీవితం ప్రారంభించి పదేళ్ళు కావస్తోంది. వాడికిప్పుడు ఇరవై రెండేళ్ళు. ప్రస్తు పనిచేస్తున్న రాజుగారి లారీకి క్లీనరుగా చేరికూడా అప్పుడే ఆరేళ్ళు కావస్తోంది.

రాజుగారిగా పిలవబడే ఆ లారీఓనరు అసలు పేరు సత్యవెంకట వరహాలరాజుగారు. ఇప్పుడిప్పు వ్యాపార కేంద్రంగా విస్తరిస్తున్న ఆ ఊళ్ళో మంచి డబ్బు, పలుకుబడీ వున్న వాళ్లల్లో అతనొకరు. సీజ చింతపండు, చేకు బిజినెస్ చేస్తారు. ఓ నూనె మిల్లుంది. వేరుసెనగ సీజన్లో రాత్రీ పగలు పనిచేస్తుం బజార్లో ఓ బట్టల షాపుంది. ఏజన్సీ నుండి కలప దూరప్రాంతాలకి తీసికెళ్ళి అమ్మే కాంట్రాక్టూ వుంది. వ్యాపారాలన్నీ విడివిడిగా చూసుకునేందుకు చేతికందుకొచ్చిన కొడుకులూ వున్నారు.

టాపుగేర్లో వున్న బండీలా ఎప్పుడూ కులాసాగానే వుంటారాయన మడతనలగని బట్టల్లో, ఖ సువాసనలు విరజిమ్మే ఖరీదయిన కిళ్ళీతో, నాలుగు వేళ్ళకీ విలువైన పొడి వుంగరాల్తో కొత్తగా వే వెళ్లొచ్చిన లారీలా మెరిసిపోతూవుంటారాయన. ఆయన నవ్వితే బెంజిబండి స్టార్టయినట్టు వుంటు

పోల్చాలంటే నేషనల్ పర్మిట్టున్న లారీలా పొడుగ్గానూ వుంటుంది. మొత్తానికి ఆయన జీవితం హైవేమీద దూసుకుపోయే వెహికల్లా సాఫీగానూ, పసందుగానూ వుంది.

ఆరేళ్ళ క్రితం రాజుగారి లారీలో క్లీనరుగా కుదురుకుని అప్పటి నుంచీ ఆ లారీని పోషించే తండ్రిలాగానో, ప్రేమించే అమ్మలాగానో భావించుకుని దాని బాగోగులు చూస్తున్నాడు ఇప్పుడు.

దాన్ని రోజూ కడగడం, ఏ రిపేరొచ్చినా దగ్గరుండి ఫోర్మేన్‌చేత రిపేరు చేయించుకోవడం, దాంతోపాటు ఊళ్ళు తిరగడం, దాన్ని కంటికిరెప్పలా చూసుకోవడం - దీనితోనే వాడికి గడిచిపోతూవుంటుంది. బహుశా వాడు దాన్ని ప్రేమించేటంతగా తనని కూడా ప్రేమించుకోడేమో.

ఉదయాన్నే ఊదొత్తులు వెలిగించి, లారీకేబిన్‌లో వున్న దేవుళ్ళ ఫోటోలకి దండలు వ్రేలాడదీయడం దగ్గర్నుంచి దాన్ని రన్నింగుకండిషనులో వుంచడంవరకూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాడు వాడు. చాలావరకు వాడి పడకా అదీ లారీలోనే. ఇంటిదగ్గర అవ్వా, పెళ్ళైనెదిగిన అక్కా మాత్రమేవున్నారు. వాడికి తల్లితండ్రి ఎప్పుడో పోయేరు. రోజులో చాలాభాగం దాని సంరక్షణలోనే గడిచిపోతుంది. వాడికి ఇక లైనుమీకెళ్తే సరేసరి. పెద్ద రిపేరేదేనా వస్తే మెకానికల్‌షెడ్లో రెండుమూడు రాత్రుళ్ళు వరసగా వాడికసలు కంటిమీద కునుకే వుండదు. రోజూ డీజిల్‌టేంకులో డీజిలాయిలూ, ఇంజనులో యింజనాయిలూ, గేర్‌బాక్స్‌లో 'సి' అయిలు వున్నాయోలేవో చూసుకోవడం మరిచిపోడు. గ్రీసుబోయ్‌ని పిల్చుకొచ్చి దగ్గిరుండి జాయింట్లకీ, రిచ్‌రాడ్‌ఎండ్స్‌కీ, టైరాడ్‌ఎండ్స్‌కీ, బేరింగులకీ గ్రీసు దగ్గరుండి ఎక్కింపించడం, కేబిన్‌లోనూ, బయటా వెలగాల్సిన అన్నిలైట్లూ సరిగా వెలుగుతున్నాయోలేదో చూసుకోవడం - ఇలాగే వాడికా లారీతో తలమునకయ్యేంత పనివుంటుంది. లారీ మామూలుగా కండిషనులో ఉన్నంత మాత్రాన వాడికి తృప్తివుండదు. దాన్ని వీలయినంత చక్కగా అలంకరించడంలో కూడా వాడికున్న శ్రద్ధ యింతా అంతా కాదు.

తన అభిమాన హీరో చిత్రం ఏది విడుదలై హిట్ అయినా, దాని పేరు రంగుల్తో లారీవెనక రాయించుకుంటేనేగాని వాడికి నిద్రపట్టదు. బ్రేక్‌లైట్లు, డేంజరు లైట్లతో పాటు కేబిన్‌లో దేవుళ్ళ ఫోటోదగ్గర రంగురంగుల మిస్సింగ్‌లైట్లు వెలగడం మానేస్తే వాడికేదో వెలితిగా వుంటుంది. నీలం, ఎరుపు, పసుపు రంగుల్లో టాప్‌లైట్లు వెలిగితేగాని వాడికి తోచదు.

ప్రతి దసరా పండుగకీ రాత్రంతా మేలుకుని లారీకి ముస్తాబుచేసి పూజకి సిద్ధం చెయ్యడమంటే వాడికెంతో ఇష్టం. అసలా రాత్రంతా వాడికి కంటిమీదకునుకేవుండదు. పెళ్ళికూతుర్ని ముస్తాబుచేసినట్టు లారీని ముస్తాబుచేస్తాడు. శుభ్రంగా కడిగి రంగు కాగితాలు అంటిస్తాడు. అరటిచెట్లు నరుక్కొచ్చి లారీ ముందు భాగంలో రెండు వేపులా కడతాడు. సింధూరం కుంకుమా చిలకరిస్తూ జల్లుతాడు. వీలయితే చెమ్కీ దండలు కూడా కడతాడు లోపల కాగితం పువ్వులతోటి, ప్లాస్టిక్ తోరణాలతోటీ విధిగా డెకరేట్ చేస్తాడు. ఏదేనా మంచి బొమ్మవున్న స్టిక్కర్ దొరికితే రైటుసైడు అద్దంమీద అంటించాలని వుబలాటపడతాడు. మొత్తం మీద తన బట్టలు ఆయిలు మరకల్తో జిడ్డుకంపు కొడుతున్నా, తైల సంస్కారం లేని జుట్టు పిచ్చిక గూడులా అసహ్యంగా కనిపిస్తున్నా వాడు పట్టించుకోడు గానీ లారీ మీద చూపించే శ్రద్ధా, ఆసక్తీ ఎక్కువనే చెప్పాలి.

మరుసటిరోజు [illegible] రాజుగారు [illegible] కలిసి దేవీపూజ ఆయుధపూజ చేస్తారు. కొబ్బరికాయ కొట్టి, ధూపదీపాలతో హారతి వెలిగిస్తాడు. రాజుగారింట్లో వాళ్ళుకూడా పూజచేసి ఇ వాళ్ళిచ్చే ప్రసాదం భక్తిగా కళ్ళకద్దుకుని స్వీకరిస్తాడు లారీకే కాక, దానితోపాటు రెంచీలు రింగు, కటింగ్‌బ్లేడు, స్క్రూడ్రైవర్లు, జాకీ, డిసిగొల్లా, క్లాంపుగొల్లా లాంటి పనిముట్లకి కూడా పూజ చేస్తాడు.

లారీ లోడు చేసుకుని ట్రిప్పు మీద బయల్దేరేటప్పుడు ముందుగా చూసుకోవల్సిన విషయాలన్నిట్లో కూడా సింహాద్రికి వాడే సహాయం చేస్తాడు. ట్రిప్‌షీటూ, ఆర్.సి. బుక్కూ జాగ్రత్తగా ఉన్నాయోలేదో చూసుకుంటాడు. చెక్‌పోస్టుల దగ్గర చూపించాల్సిన కాగితాలూ అవీ సిద్ధంచేస్తాడు. సింహాద్రికి కూడా శివుడంటే చాలా అభిమానం. వృత్తిరీత్యా అలవడిపోయిన రఫ్‌నెస్ వల్ల కాస్త కటుకుగా మాట్లాడినా శివుడిమీద అతనికి అభిమానం జాస్తి. తను టిఫిను తింటే వాడికిప్పిస్తాడు. తను టీ త్రాగితే వాడికీ టీ యిప్పిస్తాడు. దార్లో రూట్ ఆఫీసర్ల చెకింగు భయం లేదనుకున్ననాడు ఎక్కించుకున్న పేసింజర్లనుంచి వసూలయిన డబ్బులో వాడికీ కొంత యిస్తూ వుంటాడు.

సరదాగా కబుర్లు చెప్తాడు వాడితో. భుజాన వేసుకుని స్టెఫినీటైరు అవలీలగా మోసేసిన వాళ్ళ కథలూ, ఏక్సిడెంట్లు కాకుండా చాకచక్యంగా తప్పించిన డ్రైవర్ల కథలూ చెప్తూ వాణ్ని ఉత్సాహపరుస్తూ వుంటాడు. తన అనుభవాలు కూడా చెప్తూ వుంటాడు.

ఎప్పుడేనా మరీహుషారుగా వున్నప్పుడు లారీతోలమని స్టీరింగు వాడిచేతికిచ్చి, తను ప్రక్కకి తప్పుకుని చార్మినార్ సిగరెట్టు కాలుస్తూ సలహాలుకూడా యిస్తూవుంటాడు. శివుడికి కొద్దోగొప్పో డ్రైవింగ్ వచ్చిందంటే అలాగే వచ్చింది.

''నీచేత హెవీ వెహికల్ డ్రైవింగు లైసెన్సుకి కాగితం పెట్టిస్తాన్రా'' అంటుంటాడు సింహాద్రి అప్పుడప్పుడు.

''నీ దయ గురూ. స్టీరింగుతిప్పడం నేర్పించేవు. బ్రేకువెయ్యడం నేర్పేవు- గేర్లు మార్చడం చెప్పేవు. ఎప్పుడేనా నీ అంతవాణ్నయితే నీ పేరుచెప్పుకుంటాను గురూ'' అంటూ అతనికి ధన్యవాదాలు చెప్తాడు శివుడు.

* * *

బండి పని పూర్తయేసరికి పన్నెండు కావచ్చింది. జాకీ లారీక్రిందనుంచి బయటికొచ్చి, చింకిగుడ్డతో చేతులు తుడుచుకున్నాడు. శివుణ్నడిగి ఓ బీడీముట్టించి గట్టిగా దమ్ములాగి వదిలేడు. సామాన్లన్నీ తీసి, సీటుకింద అరలో సర్దేశాడు శివుడు.

తరవాత యిద్దరూ కొంచెం దూరంలో వున్న టీకొట్టుకి బయల్దేరారు. కబుర్లుచెప్పుకుంటూ వెళ్ళి టీ త్రాగేరు అక్కడ విడిపోయేరు. శివుడు తిరిగి లారీ దగ్గర కొచ్చేడు. కడుపులో వెచ్చటి టీ పడడంతో చలి కొంచెం తగ్గినట్టయింది. లారీ ఎక్కి డోరు వేసుకుని దుప్పటి ముసుగేసుకుని నిద్రకి ఉపక్రమించేడు.

* * *

ఉదయం రాజుగారు స్నానం పూజ పూర్తిచేసుకుని, నుదుటన విభూతిపట్టీలతో, [illegible] [illegible] పీట వసారాలోనే [illegible] [illegible] శివుడు కాలకృత్యాలు పూర్తి చేసుకుని

అక్కడికి వెళ్లేడు.

అప్పటికి ఎనిమిదిన్నర కావస్తోంది. శివుణ్ని చూస్తూనే, ''ఒరే బ్రోకరాఫీసుకెళ్ళి లోడ్లేమిటున్నాయో, స్టేషన్లో మనబండికి లోడెప్పుడొస్తుందో, ఎక్కడికెళ్ళాలో కనుక్కురా - ఫోనుచేద్దామంటే ఫోను పడడం లేదు'' అంటూ వాణ్ని లారీ బ్రోకరాఫీసుకి తరిమాడు. ఒక క్రమపద్ధతిలో రొటేషను ప్రకారం ఊళ్ళో లారీలన్నిటికీ ట్రిప్పులు, లోడింగులూ వుండేలా చూసేందుకు ఏర్పాటయిన బ్రోకరాఫీసు అది. దీనివల్ల లారీ యజమానులందరికీ సమానంగా మేలు జరుగుతుంది.

శివుడు అక్కడకి వెళ్ళి భోగట్టా చేసి వచ్చేసరికి సింహాద్రి కూడా రాజుగారింటి దగ్గరే వున్నాడు. ఓనరు సింహాద్రిమీద ఎందుకో కోపంగా విరుచుకు పడిపోతూ వుండడాన్ని చూసి వాడికి ఆశ్చర్యం వేసింది. ఏదో వంకపెట్టి తమని తిట్టడం ఆయనకి అలవాటే అయినా యివాళ ఎందుచేతో మరి, మరింతగా ...రుచేస్తున్నారతను. శివుడికి ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే- ఇవాళ సింహాద్రికూడా గట్టిగానే ఎదిరించి జవాబులు చెప్తున్నాడు.

లారీని నిర్లక్ష్యంగా నడుపుతూ గతుకల్లోనూ, రోడ్డు చివర్లా నడిపి మరి కొంత కాలం వచ్చేటైర్లు పాడయేలాచేస్తున్నాడనో - ఆయిలు ఎక్కువ ఖర్చయిపోతోందనో ఏదో విషయంలో ఆయన అనడం మామూలే. సరుకువేసుకుని లైను మీదికి వెళ్ళినప్పుడు - రిపేర్లవల్లనో మరే కారణం చేతో రావడం ఆలస్యమయితే గంగవెర్రులెత్తి పోతుందాయనకి.

సాధారణంగా సింహాద్రి ఓనరుగారికి ఎదురు చెప్పడు. తమకి మంచి బలమైన వర్కర్స్ యూనియన్ ఉంది కనుక తనను ఉద్యోగంలో నుంచి తీసెయ్యడం తేలికయిన పనికాదాయనకి. అంతమాత్రాన ఆయనతో దురుసుగా వ్యవహరించటమంటే సింహాద్రికి నచ్చదు.

గురువు అలా గట్టిగా జవాబిస్తున్నాడంటే ఆశ్చర్యంగానే వుంది. అక్కడకెళ్ళి నించున్నాక కాస్సేపటికి ఎందుకు ఘర్షణ పడుతున్నారో అర్థమయింది వాడికి.

క్రిందటిసారి కాకినాడ ట్రిప్పులో పేసింజర్లని ఎక్కించేరు తాము. దార్లో ఆర్టీవో పట్టుకుని ...రాసేసాడు. ఇలాంటి వ్యవహారాల్లో పెనాల్టీ డ్రైవరే కట్టుకోవాలి. ఓనరుకేం సంబంధంలేదు. ఇప్పుడు గురువు డబ్బు కట్టాల్సి వచ్చింది. దానికి తోడు ఇంట్లో భార్యకి సుస్తీగా వుంది. మందులకీ వాటికీ చాలా ...ప్తతోంది. డబ్బుకి ఇబ్బందిగా వుంది. కొంచెం డబ్బు సర్దుబాటు చెయ్యమంటున్నాడు సింహాద్రి.

''ఒరే, ప్రతిసారీ డబ్బుతే అని నా పీకల మీద కూచుంటే నాదగ్గరెక్కడ వుంటుందిరా - ముందొచ్చే ...క్షవాళ్ళని రూటు పొజిషనెలా వుందో కనుక్కుని బండి నడపాలిగాని.. ఇలా లైనుబస్సు కండక్టర్లా చెయ్యూపిన వాడినల్లా ఎక్కించేస్తూవుంటే కేసులాయరూ, మళ్ళీ డబ్బులో అంటూ నాదగ్గిరకొచ్చి బోబోమంటారు.. ఇప్పటికే జీతం అడ్వాన్సు కాక నీకు చాలా యిచ్చేను. నాదగ్గరిప్పుడేం లేదు. రోజూ రిపేర్లనీ, ఆ పార్టులనీ ఈ పార్టులనీ డబ్బు పట్టుకుపోతూనే వున్నారు. ఆయిలుచూస్తే ఎంత తాగేస్తున్నారో లెఖ్ఖలేదు. బండిని ఇష్టమొచ్చినట్టు నడపడం ఏవేనా అయితే ఓనరు ముండాకొడుకేకదా అడుక్కుతిని పోతాడు, మీకేం నష్టం మధ్యన'' అంటూ కేకలేస్తున్నారు రాజుగారు.

డబ్బు అవసరంవుంది కనుక మొదట్లో మెత్తగా మాట్లాడినా అతనెలాగూ యివ్వడని తేలిపోయేక ...స్త గట్టిగానే జవాబు లిచ్చేడు సింహాద్రి ఇదీ అక్కడ జరుగుతున్న గొడవ. భార్యజబ్బుగురించీ, ఇంట్లో

యిబ్బందుల గురించి మళ్ళీ చెప్పడానికి ప్రయత్నించేడు సింహాద్రి.

కాని రాజుగారి చూపు శివుడిమీద పడడంతో అవేమీ పట్టించుకోకుండా "ఏరా, బ్రోకారాఫీసోళ్ళ ఏటున్నారు?" అనడిగేరు వాడ్ని.

"హైద్రాబాదు లోడుంది మన బండికి" చెప్పేడు శివుడు.

"ఆ సంగతేమిటో చూడండి... వెళ్ళి కనుక్కోరా సింహాద్రీ- హైద్రాబాద్ అయితే మా ప్రసాద బయల్దేరతాడేవిటో- ఈసారి లారీ హైద్రాబాదు వెళ్ళేమాటయితే చెప్పమన్నాడు.." అంటూ లేచి యింట్లో వెళ్ళిపోయేరు రాజుగారు.

* * *

లారీ తార్రోడ్డుమీద రివ్‌రివ్‌న దూసుకుపోతోంది. లారీలో సింహాద్రీ శివుడేకాక ప్రసాదుకూడా వున్నాడు. అతను రాజుగారి మూడో అబ్బాయి. కిళ్ళీనములుస్తూ, కింగ్‌సైజు ఫిల్టరు సిగరెట్ కాలుస్తూ కులాసాగా కబుర్లు చెప్తున్నాడతను. డబ్బు తెచ్చిన నిశ్చింత, నిబ్బరం అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. యువకుడు. పెళ్ళి కాలేదు. అన్ని సరదాలూ వున్నవాడు కుర్రాడు కావడంచేత లారీ యజమాని హోదాలో బెట్టు చేయకుండా సిహాద్రితోనూ, శివుడితోనూ బాగాకలసిపోతాడు. ఇదివరకు చాలాసార్లు లారీలో వాళ్ళతోపాటు తిరిగేడు.

ప్రసాద్ హుషారుగా కబుర్లు చెప్తున్నా సింహాద్రి అతని మాటల్లో యివాళ ఉత్సాహంగ పాల్గొనడంలేదు. కారణం ఇంటి పరిస్థితి బాగుండకపోవడమేననిగమనించేడు శివుడు. ప్రసాద అడిగినవాటికి అన్యమనస్కంగా జవాబులిస్తూ లారీనడుపుతున్నాడు. సిగరెట్టు మీద సిగరెట ఊదేస్తున్నాడు. ఏదో బాధపడుతున్నట్టు అతడిముఖమే చెప్తోంది. అయినా లారీ నడపడంలో వుస అనుభవం వల్ల లారీ సాఫీగా రోడ్డుమీద పరిగెడుతోంది. గురువుని అలాంటి స్థితిలో చూసి జాలేసిం శివుడికి. గురువు హుషారుగా వుంటే ఎన్ని వింతలు చెప్పేవాడో! కానీ యివాళ గురువు సరిగా మాట్లాడ లేదు.

అనకాపల్లిలో లారీ ఆపి టీలు త్రాగేక మళ్ళీ లారీబయల్దేరింది. అప్పటికి చీకటి చిక్కబడింది. ప్రసా తను డ్రైవ్‌చేస్తానన్నాడు సింహాద్రితో. సింహాద్రి మొదట "ఎందుకులే ప్రసాదుబాబూ!" అని వారించిన అతను ఒప్పుకోకపోవడం చేత స్టీరింగు ప్రసాదు చేతికిచ్చి తను ప్రక్కకి తప్పుకున్నాడు. ప్రసాదుకి లా నడపడంలో లోగడ అనుభవం లేకపోలేదు. అప్పుడప్పుడు తనే డ్రైవ్‌చేస్తూ వుంటాడు. అతను లా నడుపుతూ వుంటే సింహాద్రి సిగరెట్ కాలుస్తూ రోడ్డువైపే చూస్తూ కూర్చున్నాడు. అతడు ముభావం వుండడాన్ని పట్టించుకోకుండా తన ధోరణిలో తను కబుర్లు చెప్తూనే లారీని పోనిస్తున్నాడు ప్రసాద్.

లారీ స్పీడు అందుకుంది. హెడ్‌లైట్ల వెలుగులో కనిపించినంత మేరకు తార్రోడ్డు జెర్రిగొ నిగనిగలాడి పోతోంది. శివుడు డోరుపక్కన ఒదిగి కూర్చున్నాడు. సింహాద్రి అల వుండటంతో నిరుత్సాహంగా వుంది వాడికి. అప్పుడప్పుడు ఏవో వెహికల్సు ఎదురయినప్పుడు కొంచె వేగం తగ్గి మళ్ళీ వెంటనే వేగం పుంజుకుని ముందుకుదూసుకుపోతోంది లారీ. ప్రక్కనుంచి వచ్చే చలిగా వొంటిని వుండి వుండి చల్లగా తాకుతోంది. కేబిన్లో మాత్రం వెచ్చగానేవుంది.

ఇంతలో ఒకమోస్తరు పెద్దవూరేదో వచ్చింది. అక్కడక్కడ జనం నడుస్తూనో సైకిళ్ళమీద వెళ్తూన కనిపిస్తున్నారు. అల్లంత దూరంలో ఊళ్ళోకి స్వాగతం చెప్తున్నట్టుగా దీపాల వరస కనిపిస్తోంది

... స్ఫటిక లాంటి డిపోల్లోకి ప్రవేశించింది. అంతే! ఒక్కసారిగా ఉయ్యూ ఇయ్యూ కుడి కీచ్ కీచ్ మని పెద్ద శబ్దం చేస్తూ లారీ ఆగిపోయింది. అంతవరకూ నిద్రలో జోగుతున్నట్టుగా వున్న పరిసరాలన్నీ ఒక్కసారిగా హాహాకారాల్తో మారు మ్రోగిపోయినయ్. సైకిలు మీద వెళ్తున్న ఒక వ్యక్తికి ఢీ ఇచ్చి అతని మీదుగా దూసుకుపోయింది లారీ. జరగబోతున్న ఏక్సిడెంటు చూస్తూనే- సింహాద్రి, లారీని సైడు మళ్ళించే ప్రయత్నంలో ప్రసాద్‌కి సహాయం చేయడానికి కూడా వ్యవధి లేకపోయింది. లారీ ఆగీ ఆగడంతోనే ప్రసాద్ డోర్ తీసుకు కిందకి గెంతేసి వెనక్కి చీకట్లోకి పరిగెత్తాడు. జనంమూగి పరిస్థితిని అర్థం చేసుకునే లోపలే అతను చీకట్లో కలిసిపోయేడు-

* * *

"గురూ- ఏటీగోరం! ప్రసాదుబాబు ఏక్సిడెంటు సెయ్యడవేటి? నువ్వు జెయిలుకెళ్ళడవేంటి?" ఏడుపుగా విలవిల లాడిపోతూ అంటున్నాడు శివుడు.

సింహాద్రి వెంటనే జవాబివ్వలేదు. నవ్వి ఊరుకున్నాడు.

"సెప్పుగురూ! ఏటీ అన్యాయం! నువ్వు నువ్వు జెయిలు కెళ్తే ఈ ఆర్నెల్లూ నీ కుటుమానం ఏటైపోవాల?" శివుడికళ్ళలో నీళ్ళు కుక్కుకుంటూ అడుగుతున్నాడు.

కొన్ని క్షణాలకి కానీ సింహాద్రి నుంచి జవాబురాలేదు. "అంతేరా - ఆ బాబు పెద్దింటి బిడ్డ. రక్షికావల్సినోడు అదీకాక ఆ బాబుకి నేను స్టీరింగివ్వడవే తప్పు... ఆర్నెల్ల కేటుందిరా! యిలాగెళ్ళి ఇలాగ వొచ్చేస్తాను మావోళ్ళ సంగలా! రాజుగోరు సూసుకుంటానని మాటిచ్చేరు."

కోపం వచ్చినప్పుడు బూతులు తిట్టినా, పనినేర్పడంలో గురువు తనపట్ల చూపిన అభిమానం గుర్తొచ్చి శివుడిగుండె బరువెక్కిపోతోంది.

కాస్సేపటికి వేదాంతిలా నవ్వుతూ అన్నాడు సింహాద్రి.

"లారీ డవున్లో వున్నప్పుడేం చేస్తాంరా? దారికట్టువేసి నిలబెడతాం. బ్రేకు తర్వాత బ్రేకులా పనిచేస్తుందది. అవునా! మనం కూడా అంతేరా... దారికట్లులాటోళ్ళం- ఓనర్ల బతుకులు డవునై పోకుండ పనివే సూడాలి..."

శివుడికి దుఃఖంతో గొంతుక పూడ్చుకుపోయింది. గురువు చెప్పేదాంట్లో ఏదో తప్పుంది. అనిపిస్తుంది. అదేంటో మనసుకి తడుతున్నట్టే వుంది కాని- మెదడుకి అందడంలేదు శివుడికి!

"ఫేక్టరీ పనోడు ఫేక్టరీలో మిషన్ని ప్రేమిస్తాడు... పూజిస్తాడు... మోటారోళ్ళం మనం- వీటిని ప్రేమిస్తాం... కాని మనం వీటిమీదచూపే ఆపేక్షలో ఒకవంతు కూడా మన ఓనర్లు, యజమానులు మనమీద చూపించరు-" అనే భావమేదో లీలగా వాడి మనసులో మెదుల్తోంది. ఆ భావం వ్యక్తం చెయ్యడం వాడికి చేతకాదు.

అందుకే-

గొంతు పెగుల్చుకుని ఒక్కొక్క మాటే పేర్చుకుంటూ, "గురూ! నువ్వొచ్చే వరకు అప్పనీ, పిల్లల్నీ నేను చూసుకుంటాను గురూ... నువ్వు ధైర్యంగా వుండు. మేం పరవాణ్ణం వండుకుంటే ఆళ్ళూ అదే తింటారు... మేం గంజి తాగితే ఆళ్ళూ అదే తాగుతారు..." అన్నాడు శివుడు.

(స్వాతి మంత్లీ 83)